# శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానము

**ఇందిరానగర్ గ్రామంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ**

**ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ అంబాల రాజ్ కుమార్**

**ఎల్కాతుర్తి ఆగస్టు 8 ప్రజా మంటలు :** మండలంలోని ఇందిరానగర్ గ్రామ అంగన్వాడి కేంద్రంలో శనివారం రోజున ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు అంగన్వాడి టీచర్ ఎడ్ల రజిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అంబాల రాజు కుమార్ ఉపసర్పంచ్ కోరే లావణ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబాల రాజ్ కుమార్ మాట్లాడుతూ పుట్టిన శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానమని పేర్కొన్నారు. శిశువు పుట్టిన వెంటనే మొదటి గంటలో తల్లిపాలు ఇవ్వడం ఎంతో అవసరమని తెలిపారు. పసుపు రంగులో వచ్చే మొదటి పాలు (కొలస్ట్రమ్) శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. అలాగే శిశువుకు మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని నీరు తేనె గ్లూకోజ్ లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పోషకాహారం ప్రారంభించి రెండు సంవత్సరాల వరకు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించడం



శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. గర్భిణీలు మరియు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ఆయన అవగాహన కల్పించారు. గర్భిణీలు సమతుల్య ఆహారం తీసుకోవడం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడడం సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని తెలిపారు. బాలింతలు పరిశుభ్రత పాటించడం తగినంత విశ్రాంతి తీసుకోవడం పోషకాహారం



తీసుకోవడం ద్వారా తల్లిపాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు స్వరూప రాణి పుష్పలత ఆశా వర్కర్ కడారి మాధవి అంగన్వాడి టీచర్ ఎడ్ల రజిత ఆయా సందెల జ్యోతి పిల్లల తల్లులు గర్భిణీలు బాలింతలు గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అట్టహాసంగా అలరించిన ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే

**ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో**

**సందడిగా మారిన కళాశాల ప్రాంగణం**

**జగిత్యాల, ఆగస్టు 08 (ప్రజా మంటలు) :** జగిత్యాల ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో "జీశ్ఓ" పేరుతో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు అట్టహాసంగా, అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ వినోద కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మక కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో



ముందుకు సాగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేకంగా అభినందించడంతో పాటు బహుమతులు అందజేశారు. కొత్తగా



కళాశాలలో చేరిన విద్యార్థులకు ఈ వేడుకలు ఆత్మీయ పరిచయ వేదికగా నిలిచాయి. ఈ కార్యక్రమం విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు వారిలో నూతన ఉత్సాహాన్ని నింపింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# వీణావాణికి ప్రతిష్టాత్మక సినారె పురస్కారం

**కవులు, రచయితలు సమాజానికి మార్గదర్శకులు**

**డా. ఎడవల్లి విజయేంద్ర రెడ్డి**

**కరీంనగర్, ఆగస్టు 08 (ప్రజా మంటలు) :** ప్రతి ఏటా కరీంనగర్ జిల్లా సాహితీ గౌతమి అందజేస్తున్న ప్రతిష్టాత్మక సినారె పురస్కారం ఈ ఏడాది ప్రముఖ రచయిత్రి, కవయిత్రి దేవనపల్లి వీణావాణికి లభించింది. స్థానిక ఐఎంఏ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పురస్కార ప్రదాత, ముఖ్య అతిథి డా. ఎడవల్లి విజయేంద్ర రెడ్డి ఆమెకు రూ. 15 వేల నగదు, పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా. ఎడవల్లి విజయేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏటా అందజేస్తున్న సినారె పురస్కారం రాష్ట్ర స్థాయిలో గొప్ప గుర్తింపు పొందడం సంతోషకరమన్నారు. కవులు, రచయితలు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ ఏడాది పురస్కారం అందుకుంటున్న దేవనపల్లి వీణావాణికి అభినందనలు తెలిపారు. ప్రముఖ కవి సినారెతో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. వీణావాణి కవిత్వంలో గొప్ప తాత్వికతతో పాటు భావాలను చిక్కగా, ప్రభావవంతంగా ఆవిష్కరించే శక్తి ఉందన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షులు నంది శ్రీనివాస్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి సంస్థ సాహితీ ప్రస్థానాన్ని వివరించారు. 1999లో సినారె అనుమతితో ప్రారంభమైన ఈ పురస్కారం నేడు తెలుగు కవులందరూ ఎదురుచూసే ప్రతిష్టాత్మక పురస్కారంగా మారిందన్నారు. పురస్కార ఎంపికలో సాహితీ గౌతమి పాటిస్తున్న నిబద్ధతే దీనికి కారణమన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కొత్త అనిల్ కుమార్ పురస్కార నివేదికను సమర్పించారు. పూర్వ అధ్యక్షులు కె.ఎస్. అనంతాచార్య వీణావాణి రచించిన శిలాఫలకం పుస్తకాన్ని పరిచయం చేస్తూ.. పుస్తకం ద్వారా కవయిత్రి తనలోకి తాను చూసుకుంటూ, తన అనుభవాలు, బాధలు, భావోద్వేగాలను ఏరిచూసి ఒక శిలాఫలకం రూపంలో పాఠకుల ముందుంచారని అన్నారు. ఆమె కవిత్వాన్ని కేవలం రచనగా కాకుండా, మనసులోని భావాలను సజీవంగా మన ముందుంచిన ప్రక్రియగా అభివర్ణించారు. పూర్వ అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ కవయిత్రి వీణావాణిని పరిచయం చేస్తూ.. సాహితీ గౌతమి సాహిత్య లోకంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవాలని ఎంతో మంది సాహితీవేత్తలు కోరుకుంటారని అన్నారు. పూర్వ ప్రధాన కార్యదర్శులు డా. బి.వి.ఎన్. స్వామి, గాజుల రవీందర్ మాట్లాడుతూ సినారె పురస్కారం సాహిత్య అకాడమీ పురస్కారంతో సమానమైన గుర్తింపును సొంతం చేసుకుందని పేర్కొన్నారు. పురస్కార గ్రహీత దేవనపల్లి వీణావాణి మాట్లాడుతూ.. గతంలో అందుకున్న పురస్కారాల కంటే సినారె పురస్కారం తనకు ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, సమాజాన్ని ప్రభావితం చేసే





కవిత్వాన్ని మరింతగా రాసే దిశగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కవులు గజేందర్ రెడ్డి, నాగేంద్ర శర్మ, కందూరి వెంకటేశ్వర్లు, కాసనగొట్టు స్వప్న, విజయలక్ష్మి, సంపత్ కుమార్, కాళిదాస్, నీలగిరి అనిత తదితరులు పాల్గొన్నారు.

# లూజ్ స్వీట్లపై 'బెస్ట్ బిఫోర్' తేదీ తప్పనిసరిగా అమలు చేయాలి

**ఫస్సై ఆదేశాలను దేశవ్యాప్తంగా కఠినంగా అమలు చేయాలి**

**సామాజిక కార్యకర్త బాస ప్రకాష్**

**జగిత్యాల ఆగస్టు 8 ( ప్రజా మంటలు) :** ప్యాకింగ్ చేయని (లూజ్) స్వీట్లపై 'బెస్ట్ బిఫోర్ ' తేదీని తప్పనిసరిగా ప్రదర్శించేలా ఫస్సై ఆదేశాలను దేశవ్యాప్తంగా కఠినంగా అమలు చేయాలని సామాజిక కార్యకర్త బాస ప్రకాష్ డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు జగిత్యాల ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సెప్టెంబర్ 25న ఫస్సై జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, 2020 అక్టోబర్ 1 నుంచి ప్యాకింగ్ చేయని స్వీట్లను విక్రయించే ప్రతి ట్రే లేదా పాత్రపై 'బెస్ట్ బిఫోర్ ' తేదీని స్పష్టంగా ప్రదర్శించడం తప్పనిసరి అని తెలిపారు. అయితే ఆదేశాలు అమల్లోకి వచ్చి సంవత్సరాలు గడిచినా దేశంలోని అనేక ప్రాంతాల్లో స్వీట్ షాపులు ఈ నిబంధనను పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వినియోగదారులు



తాము కొనుగోలు చేస్తున్న స్వీట్లు ఎంతకాలం వరకు వినియోగానికి అనుకూలంగా ఉంటాయో తెలుసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇది ప్రజారోగ్యానికి, వినియోగదారుల హక్కులకు సంబంధించిన ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఫుడ్ సేఫ్టీ కమిషనర్లకు తాజా సర్క్యులర్ జారీ చేసి, 2020 సెప్టెంబర్ 25న ఫస్సై ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన కోరారు. అలాగే లూజ్ స్వీట్లు విక్రయించే దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ప్రతి ట్రే లేదా పాత్రపై 'బెస్ట్ బిఫోర్ ' తేదీ స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించే ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ , 2006 ప్రకారం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు 'బెస్ట్ బిఫోర్ ' తేదీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా వినియోగదారుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఈ నిబంధన అమలుపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి కాలానుగుణంగా నివేదికలు తీసుకునేలా ఫస్సై చర్యలు చేపట్టాలని బాస ప్రకాష్ విజ్ఞప్తి చేశారు.

# గ్రామపంచాయతీకి వైకుంఠ రథం అందించిన మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి

**తల్లిదండ్రుల జ్ఞాపకార్థం**





**గొల్లపల్లి అగస్ట్ 08 ప్రజా మంటలు :** చనిపోయిన వ్యక్తుల పార్తివదేహాలను వైకుంఠధామం, స్మశాన వాటిక ల వరకు తీసుకెళ్లడానికి చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి అతని సోదరులు స్టీల్ వైకుంఠ రథాన్ని శనివారం గొల్లపల్లి పంచాయతీ ఆవరణంలో సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, కుల పెద్దల సమక్షంలో ప్రారంభించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గొల్లపల్లిలో చనిపోయిన వ్యక్తులను వైకుంఠధామాలు వరకు తీసుకెళ్లడానికి సుమారుగా రెండు కిలోమీటర్లకు పైగా దూరం ఉంటుందని మృతదేహాలను వైకుంఠధామం వరకు తీసుకెళ్లడానికి కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వైకుంఠ రథం తెప్పించడానికి వేళల్లో వరకు ఖర్చు అవుతుందని వివరించారు. చనిపోయిన వారి పార్తివదేహాల అంతిమయాత్రను సురక్షితంగా వైకుంఠ దామం వరకు చేర్చడానికి ఈ వైకుంఠ రథం గొల్లపల్లికి ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ ఇబ్బందులను గుర్తించిన రెడ్డి సంఘం మాజీ అధ్యక్షులు పీసు తిరుపతిరెడ్డి రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వైకుంఠ రథం అవసరాలను వారికి వివరించారు. మరణించిన వారి తల్లిదండ్రులు గడ్డం చంద్రకళ రాజారెడ్డి ల జ్ఞాపకార్థం వారి కుమారులైన చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, రిటైర్డ్ ఎస్పి రాజా రవీందర్ రెడ్డి, రమేష్ రెడ్డిల ఆర్థిక సహాయంతో మూడు లక్షల వ్యాయంతో తయారు చేయించిన వైకుంఠ రథాన్ని ప్రారంభించి పెద్దల సమక్షంలో గ్రామ పంచాయతీకి ప్రజల అవసరాల కోసం అప్పగించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుచ్చిరెడ్డి, అన్ని కుల సంఘాల సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**అరాచకాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేస్తాం**

**మాల సంఘం నాయకులు**



**గొల్లపల్లి అగస్ట్ 08 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం లోని గుంజపడుగు గ్రామంలో జరిగిన ఘటనపై మండల,జిల్లా మాల సంఘం నాయకులు స్పందించారు. బాధితురాలు,ఆమె కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని,వారికి ఎలాంటి భయాందోళనలు కలగకుండా ధైర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసే చర్యలను సహించబోమని నాయకులు స్పష్టం చేశారు. అరాచకాలకు వ్యతిరేకంగా గ్రామ,మండల,జిల్లా స్థాయిలో ఐక్యంగా పోరాటం చేస్తామని తెలిపారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆమె కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ ఘటనలో నిందితుడిపై ఇప్పటికే కేసు నమోదు చేసిన నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి,దర్యాప్తును వేగవంతం చేయాలని మాల సంఘం నాయకులు కోరారు. నిందితుడిని చట్టప్రకారం వెంటనే అరెస్టు చేసి,బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలు,ఆమె కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఈ కార్యక్రమం జిల్లా మాల సంఘం నాయకులు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జుజ మెంబర్ నల్ల శ్యాం,మాల సంఘాల మండల కన్వీనర్ కడారి రమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు జనుప వెంకటేష్, పొనగంటి రాజారత్నం, మ్యాధరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీఎఫ్ఎస్ఎల్‌లో శాస్త్రీయ అధికారిగా ఎంపికైన హరీష్‌కు సన్మానం



**గొల్లపల్లి అగస్ట్ 08 ప్రజా మంటలు :** తెలంగాణ పోలీసు శాఖ నేర పరిశోధన విభాగం ఫోరెన్సిక్ ల్యాబ్‌లో (టీజీఎఫ్ఎస్-ఎల్)లో శాస్త్రీయ అధికారిగా ఎంపికైన గొల్లపల్లి మండలం కేంద్రానికి చెందిన డా. చెవులమద్ది హరీష్‌ను పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అంకం రవి మాట్లాడుతూ నేటి యువత డా. హరీష్‌ను స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, హరీష్ సాధించిన విజయం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం యూత్ ప్రధాన కార్యదర్శి అంకం సతీష్, ఉపాధ్యక్షులు ఎనగందుల సాయికృష్ణ,పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి చౌటపెల్లి తిరుపతి (బట్టల), సహాయ కార్యదర్శి చౌటపల్లి రఘునందం, చౌటపెల్లి తిరుపతి, ఎల్లె రాజు, యూత్ సభ్యులు అంకం గణేష్, అంకం రాజు, అంకం అరుణ్ కుమార్,చౌటపెల్లి రమేష్, ఆడెపు సంజీవ్, అడ్వకేట్ చిర్ర దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షకొండలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో బోనాల సంబరాలు





**ఇబ్రహీంపట్నం ఆగస్టు 8 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఆషాడం మసం బోనాల పండగని పురస్కరించుకుని తరతరాలుగా వారసత్వంగా వస్తున్న సంప్రదాయాలను ఆచారాలను విద్యార్థులకు పరిచయం చేయాలని ఉద్దేశంతో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్ష కొండ గ్రామంలో ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్. ప్రైవేట్ అక్షర భారతి కాన్వెంట్ స్కూల్. పాఠశాల లో బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా విద్యార్థులు మరియు మహిళా ఉపాధ్యాయులు కలిసి అమ్మవారికి బోనాలు చేసి సమర్పించారు ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ పొనకంటి చిన్న వెంకట్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాజేందర్, దగ్గుల అశోక్, స్వయంగా బోనాన్ని ఎత్తి అమ్మవారికి సమర్పించారు, తర్వాత విద్యార్థులు బోనాల పండుగ పాటలకి నృత్య ప్రదర్శన చేశారు, ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం గ్రామం సుభిక్షంగా ఉండాలని విద్యార్థులందరూ ఆయురారోగ్యాలతో చక్కగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకృష్ణ ఇమ్మానుయేల్ మమత మహేష్ మాధురి స్వామి సుజాత అనిత నరేందర్,ప్రవేట్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు వార్డు సభ్యులు కూడా విచ్చేశారు విద్యార్థులు చక్కగా అలంకరించుకుని వచ్చారు, పిల్లలు పోతరాజు వేషధారణ చేసి నృత్యాలు చేశారు. ఈరోజు పాఠశాల అంతా పండగ వాతావరణాన్ని తలపించింది.

## స్తంభంపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బోర్‌వెల్ పనులు ప్రారంభం



**వెల్గటూర్, ఆగస్టు 08 (ప్రజా మంటలు) :** వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బోర్‌వెల్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో ఈ పనులను గ్రామ సర్పంచ్ భూపల్లి రాజయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాశ శ్రీధర్, ఆలయ చైర్మన్ చింతల రాజయ్య, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు వుంజలి పవన్, తిరునహరి సాయి కృష్ణ, పురోహితులు అహోబిలం దీపక్ శర్మ పాల్గొన్నారు. అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్ సప్ప లింగయ్య, చంబార్తి కొమురయ్య, హరి ప్రశాంత్, అవ్వ సాయి కృష్ణ, కమలాకర్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని బోర్‌వెల్ పనుల ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ ఆవరణలో నీటి సౌకర్యం కల్పించేందుకు బోర్‌వెల్ ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు, భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆత్మీయ కుటుంబాలను పరామర్శించిన దావ వసంత సురేష్



**జగిత్యాల, ఆగస్టు 08 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా తొలి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ రాయికల్, సారంగాపూర్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పలు ఆత్మీయ కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దావ వసంత సురేష్ వెంట ఉన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, పార్టీ శ్రేణులతో స్థానిక పరిస్థితులపై ఆమె చర్చించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షుడు అనిల్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మరంపెల్లి రాణి సాయి కుమార్, సర్పంచ్ రమ్య భాస్కర్, కౌన్సిలర్ భుక్య రాకేష్ నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ, రాజేందర్ గౌడ్, అనంతుల గంగారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, నాయిని శ్రీనివాస్ గౌడ్, రొట్టె శ్రీనివాస్, రుక్కు భాయ్, ఆది రెడ్డి, లింబాద్రి, తిరుపతిరావు, కమలాకర్ రావు, ముజోవోద్దిన్, అంజద్, అంజన్న, స్వామిరెడ్డి, చంద్రశేఖర్, రంజిత్, నరేష్, రాజు, కిషన్, రాజేందర్, సుధాకర్ రెడ్డి, బొడ్డు గంగాధర్, గోడిపెల్లి అంజి, సొరపాక అంజి, ధావనపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల గుండెలలో చిరస్థాయిగా పండుగ సాయన్న

**జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలి**

**ముదిరాజ్ జాతీయ నాయకుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు**



**సికింద్రాబాద్, ఆగస్టు 08 (ప్రజా మంటలు) :** తెలంగాణ ముద్దుబిడ్డ, బహుజన వీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ జాతీయ ఎగ్జిక్యూటివ్ మెంబర్, తెలంగాణ ఉద్యమకారుడు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొట్లకాయల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నాటి నిరంకుశ పాలనలో ఉన్నవారిని దోచి లేనివారికి పంచిన గొప్ప మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ నేలపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సాయన్నను పేద ప్రజలు తమ గుండెల్లో గుడి కట్టుకుని దేవుడిగా పూజిస్తున్నారని, ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏటా పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తున్నారని తెలిపారు. పేదల గుండెలలో చిరస్థాయిగా నిలిచిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం పాల్గొన్న ముదిరాజ్ ప్రముఖులు కూడా సాయన్న చేసిన సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు మోహన్ ముదిరాజ్, తోట సురేందర్ ముదిరాజ్, సంజయ్ ముదిరాజ్, రామోజీ నర్సింగ్ రావు ముదిరాజ్, ఈ. శ్రీనివాస్ రాజ్, తుమ్మల గంగాధర్ ముదిరాజ్ తో పాటు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా 'గ్రీన్ డే' వేడుకలు



**సికింద్రాబాద్, ఆగస్ట్ 08 (ప్రజా మంటలు) :** బోలక్‌పూర్ పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గ్రీన్ డే వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు పచ్చదనం విశిష్టత, పర్యావరణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రకృతి ప్రాముఖ్యతతో పాటు ఆకుకూరలు, పచ్చటి కూరగాయలు తినడం వల్ల కలిగే విటమిన్లు, ఆరోగ్య ప్రయోజనాలను అవగాహన పరిచారు. అలాగే పచ్చని వర్ణం కలిగిన రామచిలుక వంటి పక్షులు, చెట్ల ఆకుల ప్రాధాన్యతను చిన్నారులకు వివరించి, గ్రీన్ రంగు విశిష్టతను తెలపడం జరిగింది. చిన్నారులు పచ్చటి వర్ణ సాంప్రదాయ దుస్తుల్లో హాజరై సందడి చేశారు. ఓ చిన్నారి రామచిలుక వేషధారణలో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల వరలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొని పిల్లల్లో ఉత్సాహాన్ని నింపారు. చిన్నారుల కేరింతలు, వివిధ రూపకలతో పాఠశాల ఆవరణంలో పండగ వాతావరణం నెలకొంది.

